

# కొత్త పెన్షన్లపై అధికారికంగా ఉత్తర్వులు ఇంకా రాలేదు : ఎంపీడీవో

**పామిడి,జూన్14.అక్షర టైమ్స్:** ప్రభుత్వము నుండి అధికారిక ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తామని, అంత వరకు ఇతరుల మాటలు నమ్మి మోసపోకండి, అధికారిక సమాచారం మరియు ప్రభుత్వ ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఎంపీడీవో తేజోష్ణ శనివారంపత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. అర్హులకు మాత్రమే న్యాయం జరుగుతుందని, అనర్హులు ఇతరుల మాటలు విని డబ్బు కాలాన్ని వృథాచేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొత్త పెన్షన్ల ప్రక్రియ ప్రారంభం కాగానే మండల వ్యాప్తంగా సచివాలయాల ద్వారా ప్రజలకు సమాచారం అందజేస్తామన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఎస్టీయు జిల్లా నాయకులు

**అనంతపురం,జూన్14.అక్షర టైమ్స్:** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కీలక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయు అనంతపురం జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీ ఎన్.రమణారెడ్డి అధ్యక్షతన ఎస్టీయు కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. ప్రధానంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు కల్పించాలని, ఇప్పటికే అర్హత సాధించి, సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను తిరిగి టెట్ రాయాలని ఒత్తిడి చేయడం అన్యాయమని, వెంటనే విద్యా హక్కు చట్టంలో సవరణ చేయాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల లోకల్ కేడర్ ఆర్గనైజేషన్‌ను పారదర్శకంగా అమలు చేసి, సీనియారిటీ, పదోన్నతులు, బదిలీల విషయంలో ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు మూడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ను వెంటనే నియమించి, న్యాయమైన వేతన సవరణను అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న డీఏలు, సరెండర్ లీవ్, పీఆర్సీ బకాయిలు, ఇతర ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు విస్తృతంగా వినియోగించడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. కాబట్టి ఉపాధ్యాయులను పూర్తిగా




విద్యా బోధనకే పరిమితం చేసి, బోధనేతర విధుల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ, ఏఐఎస్టిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఉద్యోగ భద్రత, కనీస వేతన స్కేలు మంజూరు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ నందు సమూల మార్పులు చేసి అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి మాట్లాడుతూ.. గత బదిలీలలో బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, వారికి 62 సంవత్సరాల పదవీవిరమణ వయస్సు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పురపాలక ఉపాధ్యాయులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని, అర్బన్ ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలని కోరారు.ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఎస్టీయు నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులతో కలిసి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సూర్యుడు కృష్ణ మూర్తి, ప్రసాద్, రాజశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మల్లికార్జున, సురేష్, ఫణి భూషణ్, కృష్ణమోహన్, మల్లికార్జున గౌడ్, శశికళ, రవీంద్ర రెడ్డి, రవి, నాగభూషణ, సీనియర్ నాయకులు కేశవ రెడ్డి,అజయ్ కుమార్, శివయ్య చారి, నాగరాజు, ఓబులేసు, రవి నాయక్, సుధాకర్,గోవింద్ రెడ్డి, రామాంజనేయులు, నగర నాయకులు మల్లికార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాల పేరిట దోపిడీ..!

- "పుస్తకాల" పేరుతో వేల రూపాయల భారం
- బయట కొనుగోలు చేసిన పుస్తకాలు అనుమతించమంటున్న యాజమాన్యాలు
- పుస్తకాలు కొనకపోతే పిల్లలను ఇబ్బంది పెడతారేమో అంటూ తల్లిదండ్రుల ఆవేదన..
- మౌనం పాటిస్తున్న విద్యాశాఖ అధికారులు.!
- అధికారులు నిజాయితీగా వ్యవహరించి తల్లిదండ్రులకు న్యాయం చేస్తారా.?

**ఉరవకొండ,జూన్14.అక్షర టైమ్స్:** పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థల వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయనే ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పాఠ్యపుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్.కే.జీ నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, షూలు, బెల్టులు, తదితర సామగ్రిని కేవలం పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**బయట కొనుగోలు చేసిన పుస్తకాలు అనుమతించము..!**

"ఇవి ప్రత్యేక పాఠ్య పుస్తకాలు" అంటూ యాజమాన్యాలు తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని సమాచారం. ఒక్క విద్యార్థికి పుస్తకాల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ వాటి ధరలకు సరైన బిల్లులు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లల చదువులను కొనసాగిస్తున్న పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు తమకు నచ్చిన దుకాణాల్లో పుస్తకాలు కొనుగోలు చేసే హక్కు కలిగి ఉన్నారు. పాఠశాలలు విద్యార్థులపై లేదా తల్లిదండ్రులపై బలవంతపు విక్రయాలు నిర్వహించరాదని విద్యాశాఖ పలు మార్లు స్పష్టం చేసింది. విద్యాహక్కు చట్టం--2009 ప్రకారం విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, అదనపు ఆర్థిక భారాలతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయరాదని చట్టం చెబుతోంది. అయినప్పటికీ ఉరవకొండలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం నిబంధనలను బేఖాతరు చేస్తూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మండల విద్యాశాఖ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సంవత్సరం పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చూపించినా, ఆ తనిఖీలు కేవలం తూతూ మంత్రంగానే మిగిలిపోతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొంతకాలం హడావుడి చేసి, తర్వాత మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతుండటం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పాఠశాల యాజమాన్యాలతో అధికారులు చేతులు కలిపి ముడుపులు తీసుకుంటూ వారికే వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



**పుస్తకాలు కొనకపోతే పిల్లలను ఇబ్బంది పెడతారేమో అంటూ తల్లిదండ్రుల ఆవేదన..!**

విద్యార్థి సంఘాలు లేదా తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారే తప్ప, స్వయంగా ముందుకు వచ్చి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనిఖీలు నిర్వహించినా కేవలం నోటీసులతో సరిపెట్టడం, తర్వాత మళ్లీ అదే పాఠశాలలు పుస్తకాల విక్రయాలు కొనసాగించడం షరా మామూలుగా మారిందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో పాఠశాలల్లో పుస్తకాలను సీజ్ చేసినట్లు ప్రచారం జరిగినా, కొద్ది రోజులకే మళ్లీ విక్రయాలు ప్రారంభమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు పాఠశాలలతో వాదనలు పెట్టుకోలేక మౌనంగా డబ్బులు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడింది. "పుస్తకాలు కొనకపోతే పిల్లలను ఇబ్బంది పెడతారేమో", "తరగతుల్లో అవమానిస్తారేమో" అనే భయంతో చాలామంది తల్లిదండ్రులు యాజమాన్యాల డిమాండ్లకు తలొగ్గుతున్నారని సమాచారం. దీంతో ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మధ్యతరగతి మరియు పేద కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్--8, 9 ప్రకారం విద్యార్థులకు వివక్ష లేకుండా విద్యా సౌకర్యాలు అందించడం ప్రభుత్వ అధికారుల బాధ్యతగా పేర్కొనబడింది. అయితే ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఈ బలవంతపు విక్రయాలు చట్ట ఉద్దేశాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఉరవకొండలో జరుగుతున్న ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల్లో జరుగుతున్న అక్రమ పుస్తకాల విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కూడా డిమాండ్లు వినిపిస్తున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి ఇకనైనా చెక్ పడుతుందా..? విద్యాహక్కు చట్టం కేవలం పుస్తకాలకే పరిమితం అవుతుందా..? లేక నిజంగా అమలులోకి వస్తుందా..? అధికారులు నిజాయితీగా వ్యవహరించి తల్లిదండ్రులకు న్యాయం చేస్తారా..? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఉరవకొండ ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈసారి అయినా సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించి ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఉచిత కంటి మెగా వైద్య శిబిరంకు విశేష స్పందన

- కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే








**పామిడి,జూన్14.అక్షర టైమ్స్:** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు , మరియు లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ విరుపాక్షి రెడ్డి, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ అభిషేక్ పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పత్రాశ్రీనివాసులు, రఘువీర్ రావ్ మాట్లాడుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు మాత్రమే అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకొని చేసుకోవచ్చన్నారు.కంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేక్ కంటి వైద్య శిబిరానికి వచ్చిన 260 మందిని పరీక్షించి అందులో 123 మందిని కంటి ఆపరేషన్ కు ఎంపిక చేశారు.ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు లైన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ మురళీకృష్ణ జయరాంరావు,క్లబ్ కోశాధికారి డి. షేక్షావలి,ఉపకార్యదర్శి ముండే షేక్షావలి. క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్ కుమార్, ,డైరెక్టర్స్ శ్రీనివాస్ బాషా ప్రసాద్ పత్రారాకేష్, అంజి నాయక్ . రామాంజనేయులు, కొత్తూరునల్లయ్య, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ రాకేష్. శంకర హాస్పిటల్ సిబ్బంది మరియు లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. తదుపరి పర్యావరణ పరిరక్షణ కొరకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి జబ్బు చికిత్స కోసం పాల్గొన్న వారందరికీ రెండు మొక్కలు చొప్పున 500 మొక్కలు పంపిణీ చేశారు.

# నడిమి వంక పూడికతీతతో ప్రజలకు ఊరట

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు, యూనిట్ ఇంచార్జ్ మోహన్‌కు అభినందనలు





**అనంతపురం,జూన్14.అక్షర టైమ్స్:** గత 30 సంవత్సరాలుగా ఏ నాయకులు పట్టించుకోని సమస్యకు ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ శాశ్వత పరిష్కారం చూపించారు. ప్రజా సమస్యలపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే నిజమైన ప్రజా నాయకుడిగా ఆయన మరోసారి నిరూపించుకున్నారు. 47 డివిజన్ రంగస్వామి నగర్, 48 డివిజన్ రజక నగర్, బాలాజీ నగర్ ప్రజల వరద ముంపు కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ స్వయంగా చొరవ తీసుకున్నారు. ఆయన ఆదేశాలతో 48వ డివిజన్ టీడీపీ యూనిట్ ఇంచార్జ్ మోహన్ జేసీబీలతో నడిమి వంక పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.. "మా కష్టం చూసి చలించిపోయారు. 30 ఏళ్లుగా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు మా మొర విన్నవారు లేరు. కానీ ఆయన రాగానే.. మా సమస్య ఆయనకు సొంత సమస్య అయ్యింది" అని కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు. పనులకు అడ్డుపడిన రంగ అనే వ్యక్తి విషయంలోనూ ఎమ్మెల్యే సూచనలతో మోహన్ సహనంగా వ్యవహరించి, స్థానికులను కలుపుకొని సమస్య పరిష్కరించారు. ఆయనతోపాటు డివిజన్ నాయకులు నసనకోట కృష్ణ, వడ్డే మహేశ్వరి, కొలిమి జావేద్, నాగేంద్ర, తనీష్ తదితరులు సహకారం అందించారు. వర్షాకాలం ముందే ఈ పనులు చేయించడం ద్వారా ఎమ్మెల్యే లక్షల మంది ప్రజల ఇళ్లను వరద ముంపు నుండి కాపాడారని స్థానికులు కొనియాడారు. "అభివృద్ధి అంటే ఇదే.. ప్రజా నాయకుడు అంటే ఇతనే" అంటూ దగ్గుబాటి ప్రసాద్‌కు జేజేలు పలికారు. ఈ సందర్భంగా కాలనీవాసులంతా ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు, పట్టుదలతో పనులు చేయిస్తున్న యనిట్ ఇంచార్జ్ మోహన్‌కు అభినందనలు తెలియజేశారు. ఇదిలా ఉండగా.. జేసీబీలతో పనులు చేస్తున్న కార్మికులకు సైతం మోహన్ కుమార్ తన సొంత ఖర్చులతో భోజన సదుపాయం ఏర్పాటు చేయడమే కాకుండా ఆయన కూడా వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

# రక్తదాన శిబిరానికి విశేష స్పందన




**పెద్దవడుగూరు,జూన్14.అక్షర టైమ్స్:** ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన పెద్దవడుగూరు చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద రక్తదాన శిబిరం సుమంత్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయాలని కోరారు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని రక్తం ఇవడం వల్ల ఆరోగ్యానికి కూడా మంచిదేనని అన్నారు. ఏడాదికి ఒకసారి రక్తం దానం చేయడం వల్ల శరీరానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు అనంతరం సుమంత్ ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎక్కలూరు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలందరూ రక్తదాన శిబి రాలలో దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. అవసరానికి రక్తం తీసుకోవడమే కాకుండా రక్తదానం చేసేందుకు కూడా ముందుకు రావాలని విన్నవించారు. రక్తం దానం 20 మంది రక్తం దానం చేశారని తెలిపారు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరు ఆయన కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో అశోక్ బాలకృష్ణ రమణ సూరి రంగనాథ్ ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఏపీటీఎఫ్ 1938 కంబదూరు మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**అనంతపురం,జూన్14.అక్షర టైమ్స్:** అనంతపురం ఎన్జీవో హోంలో నిర్వహించిన ఏపీటీఎఫ్ కంబదూరు మండల శాఖ ఎన్నికలు ఆహ్లాదకరమైన వాతావరణంలో విజయవంతంగా జరిగాయి. ఈ ఎన్నికలలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించగా, రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ నాయక్ ఎన్నికల అధికారిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరెడ్డి సహాయ ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కంబదూరు కమిటీకి మండల గౌరవాధ్యక్షులుగా భువనేంద్ర కుమార్, అధ్యక్షులుగా మంగళకుంట నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.అక్కులన్న, గౌరవ సలహాదారులుగా సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.వీరాంజనేయులు, సహాధ్యక్షులుగా గురుమూర్తి, మాధవి లత, అదనపు కార్యదర్శిగా శంకర్ నారాయణ కార్యదర్శులుగా వెంకటేశులు, సక్కి భాయి, జగదీష్, కార్యవర్గ సభ్యులుగా రవికుమార్, తిరుపాలు, బాలనాగిరెడ్డి, వెంకటరమణ, రాఘవేంద్ర, మహబూబ్ భాష, రాజకుమార్, చంద్రశేఖర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ఏపీటీఎఫ్-1938 సంస్థ బలోపేతానికి సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. జిల్లా, రాష్ట్ర నాయకులు నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ, కంబదూరు మండలంలో ఏపీటీఎఫ్ సంస్థను మరింత బలోపేతం చేసి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

### అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**ధర్మవరం,జూన్13.అక్షర టైమ్స్:** రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, జూన్ 14 మరియు 15 తేదీల్లో ధర్మవరం పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో విస్తృత పర్యటన నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి, ఆరోగ్య అవగాహన, దివ్యాంగుల సంక్షేమం, రైతు సంక్షేమం, ఆసుపత్రి సేవల మెరుగుదల మరియు క్రీడా ప్రోత్సాహానికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు వివరించింది. ఆదివారం సాయంత్రం 05:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని గిర్రాజు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా ఆ ప్రాంత ప్రజలకు మెరుగైన మరియు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని మంత్రి కార్యాలయం పేర్కొంది. సోమవారం ఉదయం 06:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించే యోగా కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఆరోగ్యకర జీవనశైలికి యోగా అత్యంత అవసరమని, శారీరక--మానసిక ఆరోగ్య పరిరక్షణలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం వెల్లడించింది. అనంతరం ఉదయం 10:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని ఎల్.సి.కె పురంలో ఉన్న ప్రభుత్వ






పాఠశాలలో నిర్వహించే దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు ఉపకరణాలను అందజేస్తారు. దివ్యాంగుల జీవితంలో స్వావలంబన పెంచడం, వారి దైనందిన జీవితాన్ని సులభతరం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తర్వాత ఉదయం 11:30 గంటలకు పోతులనగేపల్లిలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ అవసరాల సరఫరా ద్వారా వ్యవసాయోత్పత్తి పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 2:30 గంటలకు ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొంటారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. చివరిగా మధ్యాహ్నం 3:30 గంటలకు ధర్మవరం పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో జరుగుతున్న పురుషుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో మంత్రి పాల్గొంటారు. యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం, క్రీడలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ రెండు రోజుల పర్యటనలో ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం, సంక్షేమ పథకాల అమలు మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది.

# మడకశిర వైద్య సేవల మెరుగుదలపై మంత్రి సత్యకుమార్‌తో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు భేటీ

### ఆరోగ్య సేవల బలోపేతమే లక్ష్యం.. మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎంఎస్ రాజు

- మడకశిరలో మెరుగైన వైద్య సేవల కోసం కీలక చర్చ
- ప్రజారోగ్యానికి ప్రాధాన్యం మంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన ఎమ్మెల్యే రాజు
- అభివృద్ధే లక్ష్యం... మడకశిర సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే రాజు

**ధర్మవరం,జూన్14.అక్షర టైమ్స్:** మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజు ఆదివారం సాయంత్రం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా మడకశిర నియోజకవర్గంలో వైద్య మరియు ఆరోగ్య సేవలకు సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి తో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల అభివృద్ధి, వైద్యుల కొరత, అవసరమైన వైద్య సిబ్బంది నియామకం, అత్యవసర వైద్య సేవల బలోపేతం, మందుల సరఫరా, గర్భిణీలు మరియు బాలింతలకు మెరుగైన వైద్య సేవలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మడకశిర నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన



అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణతో పాటు ఆధునిక వైద్య పరికరాల అందుబాటు పెంచాలని మంత్రి ని కోరారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుంటోందని పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని, ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల బలోపేతానికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ--పట్టణ ప్రాంతాల మధ్య ఆరోగ్య సేవల వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.

# జిల్లా స్థాయి ప్రకృతి వ్యవసాయ సదస్సు

### ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం: సోమల ప్రకాష్ నాయుడు

**బత్తలపల్లి,జూన్14.అక్షర టైమ్స్:** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ నెల 15వ తేదీన బత్తలపల్లి మండలం సంజీవపురం సమీపంలోని కాటమయ్యకొండ వద్ద ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో జిల్లా స్థాయి ప్రకృతి వ్యవసాయ సదస్సు నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ రైతు విభాగం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం కారణంగా రక్తపోటు, మధుమేహం, కర్కాటక వ్యాధి వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమని, రైతులు రసాయన రహిత సాగు విధానాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ రైతు విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఈ సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ సాగు విధానాలు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే మార్గాలపై రైతులకు సూచనలు, సలహాలు అందజేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు అవసరమైన పలు తీర్మానాలను సమావేశంలో ఆమోదించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల మోహన్ శేఖర్, రాష్ట్ర కార్యదర్శి శరత్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు. రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ అనుబంధ రంగాల వారు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు జనగాని నాగభూషణం, దేశ నారాయణ, గురవ రాములు, ఆరువేటి గంగప్ప, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శ

- విషాదంలో ఉన్న కుటుంబాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ధైర్యం
- పెన్నబోలు నారాయణమ్మ, గుద్దిటి అనిల్ కుటుంబాలను పరామర్శించిన మంత్రి

**ధర్మవరం,జూన్14.అక్షర టైమ్స్:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తో కలిసి ఆదివారం సాయంత్రం ధర్మవరం పట్టణంలో రెండు విషాద కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మొదటగా రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం కన్వీనర్ పెన్నబోలు విజయ్ భాస్కర్ రాయల్ మాతృమూర్తి శ్రీమతి పెన్నబోలు నారాయణమ్మ ఈ నెల 11వ తేదీన పరమపదించిన విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.నారాయణమ్మ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన మంత్రిగారు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ వారికి ఓదార్పు కలిగించారు. అనంతరం ధర్మవరం పట్టణంలోని పీఆర్‌టీ స్ట్రీట్‌కు చెందిన తెలుగుదేశం పార్టీకి అత్యంత విధేయుడు, పార్టీ నాయకులు గుద్దిటి అనిల్ కుమార్ శనివారం అకాల మరణం చెందిన విషయం



తెలుసుకుని, మంత్రి సత్యకుమార్ యాదవ్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనిల్ కుమార్ అకాల మరణం తీవ్ర విషాదకరమని పేర్కొన్న మంత్రి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతూ..ప్రియమైన వారిని కోల్పోవడం కుటుంబాలకు తీరని లోటు. ఈ దుఃఖాన్ని మాటల్లో తగ్గించలేము. కానీ ఈ కష్టసమయంలో మేమంతా మీకు అండగా ఉంటాం అని అన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన నర్సరీ కూలీ కుటుంబానికి రూ.71 వేల ఆర్థిక సాయం

### ఆశబీ కుటుంబానికి అండగా నర్సరీ నిర్వాహకులు



**ముదిగుబ్బ,జూన్14.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని ఓ నర్సరీలో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆశబీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న ఆశబీ మృతి చెందడంతో వారి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఈ విషయం తెలుసుకున్న ముదిగుబ్బ నర్సరీ నిర్వాహకులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆశబీ కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం మండల కేంద్రంలోని రైల్వే గేట్ కొట్టాలో ఉన్న ఆశబీ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ రూ.71 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆశబీ నర్సరీలో ఎంతో కష్టపడి పనిచేసేదని, ఆమె మరణం తమను కూడా కలచివేసిందని నిర్వాహకులు తెలిపారు. కుటుంబం ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని తమ వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందించినట్లు పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. నర్సరీ నిర్వాహకులు చేసిన ఈ సహాయానికి ఆశబీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారి కష్టకాలంలో అండగా నిలిచినందుకు కుటుంబ సభ్యులు, బంధువులు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ నర్సరీ నిర్వాహకులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థముతో, ఐక్యత ఉన్నప్పుడే బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారం అవుతాయి: కైపా ద్వారకనాథ శర్మ





**ధర్మవరం,జూన్14.అక్షర టైమ్స్:** నిస్వార్థముతో ఐక్యత ఉన్నప్పుడే బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారం అవుతాయని కైపా ద్వారకా నాథ శర్మ అన్నారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా దేశాయి పనిరాజ్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ కాశీ విశ్వనాథ స్వామి వారి ఆలయంలో బ్రాహ్మణ కుటుంబీకులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్, డీఎస్సీలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను వారు పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థులలో కైప వజ్ర నగేశ్వర్ శర్మ, ఉదయ్ సాత్విక్, ఇంటర్మీడియట్ లో జ్ఞాన శ్రీత, డీఎస్సీలో అష్టకళ శ్రావణి, అదేవిధంగా డీఎస్సీలో మంచి ప్రతిభ ఘనపరిచి ఉపాధ్యాయులుగా ఎంపికైన చీపాటి శివతేజ లను ఘనంగా సన్మానించారు. తదుపరి ద్వారక నాథ్ శర్మతోపాటు ముఖ్య అతిథులు మాట్లాడుతూ బ్రాహ్మణ విద్యార్థులను ప్రోత్సహించడానికి మాత్రమే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. నిస్వార్థపుతో బ్రాహ్మణ కులస్తులు ముందుకు వెళితే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణులు తమ జీవన విధానమును అభివృద్ధి చేసుకొని అవకాశం ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు యువతి యువకులను స్థానం కల్పించినప్పుడే మంచి గుర్తింపు, మంచి ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. బ్రాహ్మణుల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అవసరమని,బ్రాహ్మణులు అంత ఒకే తాటిమీద నిలబడాలని తెలిపారు. ఇకనుంచి బ్రాహ్మణ విద్యార్థులను ప్రోత్సహించడమే మా లక్ష్యము అని తెలిపారు, బ్రాహ్మణ విద్యార్థులు సంకల్పము, లక్ష్యంతో ముందుకు వెళితే విజయం తప్పక లభిస్తుందని తెలిపారు. బ్రాహ్మణులకు చదివే మూలాధారమని, ఆ చదువును నిర్లక్ష్యం చేయకుండా ముందుకు సాగితే సుఖవంతమైన జీవితం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి మంజునాథ్, గ్లామర్ సురేష్, ట్రాన్స్పోర్ట్ రవి, కరణము నరసింహామూర్తి, మునిపల్లి జైసింహ, సుధీర్ శర్మ, చంద్రమౌళి శర్మ, రాజశేఖర్ శర్మ, రాఘవ తో పాటు మహిళలు కూడా పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పురస్కారాలు



**హిందూపురం,జూన్15.అక్షర టైమ్స్:** బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ స్ట్రీట్ వెండర్స్ సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయడం జరిగింది. స్థానిక కనుక దాసు కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వన్ టౌన్స్ సిఐ రాజగోపాల్ నాయుడు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటుగా ఒడిదుడుకులను తట్టుకునే మానసిక ధైర్యం అవసరమని అందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని ఆ విధంగా కూడా పిల్లలను ప్రోత్సహించాలని సెల్ఫోన్ వాడకం తగ్గించి సమయాన్ని ఉపయోగించుకునే విధంగా తల్లితండ్రులు ప్రోత్సహించాలని ఏది మంచి ఏది చెడు అన్న విషయాలను క్లుప్తంగా వివరించాలని వారి మానసిక పరిస్థితులకు అనుగుణంగా ధైర్యం చెప్పాలని, విద్యార్థి దశలో ఏదైనా సాధించే పట్టుదల ఎక్కువగా ఉంటుందని కావున విద్య పైనే శ్రద్ధ చూపే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. బిసి ఎస్సి , ఎస్టి మైనార్టీ వీవోర్స్ స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పార్వతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండి కష్టపడే వ్యక్తిత్వాన్ని అలవాటు చేసుకోవాలని ప్రతిరోజు విద్య మీద శ్రద్ధ పెట్టడం వల్ల దాన్ని వలన వచ్చే ఫలితం గర్వపడేలా మంచి స్థానాన్ని కల్పిస్తుందని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి ఎస్సీ ఎస్టీ రాష్ట్ర అధ్యక్షులు కే నాగజ్యోతి కురువ సంఘం అధ్యక్షులు చలపతి , బిసి అధ్యక్షులు ఈశ్వరయ్య, చేనేత అధ్యక్షులు జగదీష్, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు నాగప్ప, కురు సంఘం ఆంజనేయులు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, బీసీ నాయకులు జయరాం, బీసీ తాలూకా అధ్యక్షులు పద్మావతి, బీసీ నాయకులు, పలువురు విద్యార్థులు,తల్లితండ్రులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా తరగతులు



**హిందూపురం,జూన్14.అక్షర టైమ్స్:** పట్టణంలోని మేళాపురం క్రాస్ వద్ద మీసేవ కేంద్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో యోగా గురువు శ్రీనివాసరెడ్డి యోగా శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతూ ఉంది. ప్రతి ఆదివారం ఇక్కడ జరుగు ఫాలోఅప్ తో పాటు కొత్తవారికి కూడా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఇందులో ప్రాణాయామం, బస్త్రిక, సుదర్శన క్రియ ,సూర్య నమస్కారాలు తదితర యోగాసనాలను శిక్షణ ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.